కలగానే మినీ రిజర్వాయర్

పుష్కలంగా నీరుంటే రైతులు పంటలు పంటలు పండించుకుంటారు. తద్వారా వారిలో కొనుగోలు శక్తి పెరుగుతుంది. మార్కెట్‌లోకి పంట దిగుబడులు ఎక్కువగా రావడం వల్ల ప్రజలకు అందుబాటులో ధరలు ఉంటాయి. ఈ విషయాన్ని గుర్తించిన పూర్వీకులు అక్కడక్కడా పెద్ద పెద్ద చెరువులను నిర్మించారు. పెళ్లకూరు మండలంలోనే పెద్ద చెరువుగా చెంబేడు చెరువుకు పేరుంది. దీన్ని మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే కొన్ని వేల ఎకరాల్లో పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు దశాబ్దాలుగా కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైతుల కల కలగానే మిగిలిపోతోంది.


చెంబేడు చెరువు

- చెంబేడు చెరువు నుంచి 17 చెరువుల్లోకి నీరు
- 18 వేల ఎకరాల్లో పంటల సాగుకు అనుకూలం
- రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని కోరుతున్న రైతులు
- పట్టించుకోని పాలకులు

పెళ్లకూరు: మండలంలో 90 శాతం మందికి పైగా రైతులు చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఇక్కడ 67 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వీటి కింద 5,750 హెక్టార్లలో వరి, 1,340 హెక్టార్లలో వేరుశనగ, 170 హెక్టార్లలో మినుము, 1050 హెక్టార్లలో పెసర, 1270 హెక్టార్లలో కూరగాయలు సాగు చేస్తారు. 67 చెరువల్లోఅ చెంబేడు చెరువు పెద్దది. ఇది 832.40 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మూడు కలుజులు, ఏడు తూములు కలిగి ఉంది. దీనికి ఐదు వేలు ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. చెంబేడు చెరువుకు అనుసంధానంగా చెన్నప్పనాయుడుపేట, బంగారంపేట, మోదుగులపాళెం, నందిమాల, శిరసనంబేడు తదితర సుమారు 17 చెరువులు ఉన్నాయి. చెంబేడు చెరువు ఒకసారి నిండితే 17 చెరువుల్లోకి నీరు చేరుతుంది. దీంతో రైతులు ఏడాదికి రెండు పంటల చొప్పున సాగు చేస్తారు. ముఖ్యంగా వరి పంట ఎక్కువగా సాగవుతుంది. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుంది.

చెరువుకు స్వర్ణముఖి, తెలుగు గంగ నీరు

చెంబేడు చెరువు ప్రాధాన్యతను గుర్తించిన ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి స్వర్ణముఖి సిస్టం కింద చెంబేడు చెరువుకు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ఎన్‌టీ రామారావు హయాంలో 7వ బ్రాంచ్ కాలువ ద్వారా తెలుగుగంగ జలాలు సరఫరా చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నాటి నుంచి ఇక్కడి రైతులు చెరువుపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఉన్న కిలివేటి సంజీవయ్య చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని భావించారు. రూ.32 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. దీన్ని రిజర్వాయర్ చేయడం వల్ల కలిగే లాభాలను ప్రభుత్వానికి వివరించారు. చెంబేడు, చెన్నప్పనాయుడుపేట, అర్ధమాల, ఆర్లపాడు, చిల్లకూరు, శిరసనంబేడు, నందిమాల, మోదుగులపాళెం, బంగారంపేట, యర్రగుంట గ్రామాల్లోని చెరువులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని తెలిపారు. తద్వారా 18 వేల ఎకరాలకు పైగా సాగునీరుతో పాటు ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందించవచ్చని తెలియజేశారు. మండలంలోని 75 శాతం వ్యవసాయ భూములన్నీ సస్యశ్యామలమవుతాయని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓడిపోవడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది.


చెంబేడు చెరువు కింద సాగు చేస్తున్న వరి పంట

భారీ వర్షాలు కురిసినా పట్టించుకోలేదు

ఈ ప్రాంతంలో ప్రతి ఏటా తుపానులు, రుతుపవనాల వల్ల అక్టోబర్ నుంచి నాలుగు నెలలపాటు భారీ వర్షాలు కురుస్తాయి. వరద నీటితో చెంబేడు చెరువుకట్ట బలహీనమవుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కనీసం నీటి పారుదల శాఖ అధికారులు కూడా ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం అటుంచి చెరువు కట్టను బలోపేతమైనా చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు మేలు చేయాలి



సేద్యమే ఊపిరిగా అనుక్షణం కష్టపడి పంటలు పండించే రైతులకు కూటమి ప్రభుత్వం మేలు చేయాలి. వ్యవసాయానికి సాగునీరు అందించే చెరువులను అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మారిస్తే ఈ ప్రాంతంలోని భూములు సస్యశ్యామలమవుతాయి.

–తిరుపాలయ్య, అర్ధమాల

మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి



చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి. తద్వారా 17 చెరువులను సాగునీరు పుష్కలంగా అందించే అవకాశం కలుగుతుంది. 75 భూములు సస్యశ్యామలమవుతాయి. ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోవచ్చు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–వెంకటేశ్వర్లు, చెంబేడు

క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



గూడూరు రూరల్: గూడూరులోని జన విజ్ఞాన వేదిక సభ్యులు శుక్రవారం సాయి రాం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జేవీవీ సంస్థ ఉపాధ్యక్షుడు చెంచునారాయణ కుమారుడు నీలేష్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసినట్టు తెలిపారు. సంస్థ ప్రతినిధులు నాగరాజు, పురుషోత్తమరావు, రామ్మోహన్‌రావు, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్, కళ్యాణి పాల్గొన్నారు.

వందశాతం అక్షరాస్యతే లక్ష్యం


మెటీరియల్‌ను అందజేస్తున్న జెడ్పీ సీఈవో

సైదాపురం: నెల్లూరు జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వంద శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు జెడ్పీ సీఈవో విద్యాధరి తెలిపారు. సైదాపురంలోని పొదుపు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంపై రెండో విడత శిక్షణ చేపట్టారు. ఇందులో జెడ్పీ సీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పొదుపు సంఘాల్లోని సభ్యుల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షర జ్ఞానం నేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్టు తెలిపారు. అక్షర కేంద్రాలకు అభ్యాసకులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి మెటీరియల్ అందజేశారు. ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

బాలాయపల్లి(సైదాపురం): గ్రామాల్లో విషజ్వరాలు ప్రబులుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి ప్రమీల తెలిపారు. ఆమె శుక్రవారం బాలాయపల్లిలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి చికిత్స చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

వాకాడు: వాకాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై శుక్రవారం దాడులు చేసినట్టు సీఐ ప్రసాద్ తెలిపారు. కోట మండలం ఊనుగుంటపాళెంలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న పాకనాటి జనార్దన్‌ను అరెస్టు చేసి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎక్కడైనా బెల్టు దుకాణాలు నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

'ప్రగతి'లో ఓటరు దినోత్సవం


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కోట: స్థానిక ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు చేపట్టారు. ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. తమకు నచ్చిన వారికి ఓటు వేసి గెలిపించుకోవచ్చని చెప్పారు. పోటీల్లో విజేతలకు శనివారం బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కలువాయి: మండలంలోని వెరుబొట్లపల్లిలో దళితులపై దాడి చేసిన అగ్రకులాల వారిని అరెస్టు చేయాలని ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిజమాల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దళితులపై దాడిచేసి మళ్లీ వారిపైనే కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జిల్లా నాయకులు గొల్లపల్లి నరసయ్య, రేవూరి శ్రీనివాసులు, దొరబాబు, సురేష్, వంశీ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

గూడూరు రూరల్: తిరుపతిలోని కంచి పాదుకా మండపంలో ఫిబ్రవరి 2న శ్రీ వేంకట గాయత్రి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. వారు శుక్రవారం గూడూరులోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో వివాహ పరిచయ వేదిక పోస్టర్లు విడుదల చేశారు. అనిమెళ్ల శివకుమార్ మాట్లాడుతూ వివాహ పరిచయ వేదిక సందర్భంగా సామూహిక షష్టి పూర్తి, భీమరథ శాంతి హోమం కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440271154, 9247844224లో సంప్రదించాలని కోరారు.

పశువులకు వైద్య చికిత్సలు

కలువాయి: పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని పశువైద్యాధికారి డాక్టర్ గంగాధర్ తెలిపారు. మండలంలోని మాదన్నగారిపల్లిలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గేదెలకు గర్భకోశ, గొర్రెలకు మసూచి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. నట్టల నివారణ మందును తాగించారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి


సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో అతిథులు, పాఠశాల ప్రతినిధులు

చిల్లకూరు: పిల్లలు విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు అజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. చిల్లకూరు సమీపంలోని శారదా నగర్‌లోని లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం 40వ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జ్యోతి వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసం, శరీర దృఢత్వం కలుగుతాయని చెప్పారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ పీటీఏ కార్యదర్శి కొణిదల మునిగిరీష్, ప్రిన్సిపాల్ ఓం నమఃశివాయ, హెచ్‌ఎం సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్ ఏర్పాటుపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : మండలంలోని వద్దిగుంటకండ్రిగ గ్రామం ఎస్టీ కాలనీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్ మిక్సర్, తారు ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు వాపోయారు. వారు శుక్రవారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర‌న్‌కు ఫిర్యాదు చేశారు. ప్లాంటు వల్ల పర్యావరణం దెబ్బతినడంతోపాటు స్థానికులు రోగాల బారిన పడతారని తెలిపారు.

మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాలైన గుమ్మళ్లదిబ్బ, కొత్తూరు, తమ్మినపట్నంలోని రైతులకు క్రిష్ణపట్నం పోర్టు అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ మాట్లాడుతూ రైతులకు చిన్ననీటి పారుదలపై అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యాన శాఖాధికారి కార్తీక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ ప్రాంతంలో పుచ్చసాగు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. 25 మంది రైతులను గ్రూపుగా ఎంపిక చేసి పోర్టు సీఈవో జగదీష్ పటేల్ సహకారంతో మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందజేయనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధి సీహెచ్ వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ కన్సల్టెంట్ డాక్టర్ ఆర్ సెల్వరాజ్, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, కొత్తూరు పెద్ద కాపు శ్రీనివాసులు, వెంకయ్య పాండు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఎంఎస్‌ఎంఈ సర్వే

కలువాయి: మైక్రో, స్మాల్, మీడియమ్ ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లూరు జెడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జె.మోహన్‌రావు ఆదేశించారు. ఆయన శుక్రవారం కలువాయి మండలంలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టివి.శివకుమార్, సీనియర్ సహాయకులు ఎం.రమేష్‌బాబు, విస్తరణాధికారి జీవి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో విద్యాధరి

సైదాపురం: నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని నెల్లూరు జిల్లా జెడ్పీ సీఈవో విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ మాట్లాడుతూ కండలేరు నుంచి సైదాపురం మండలంలోని 31 గ్రామాలకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఎంఈవోలు దయాకర్, సుప్రియ, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను తొలగించడం దారుణం

గూడూరు రూరల్: ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులను తొలగించడం దారుణమని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో గోడకు ఆనుకుని చిరు దుకాణాలు ఏర్పాటుచేసుకున్న వారిని శుక్రవారం అధికారులు అక్కడి నుంచి ఖాళీ చేయించారు. అక్కడికి చేరుకున్న సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఏ రోజుకారోజు వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకునే వారిపై ప్రతాపం చూపడం దారుణమని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలపై ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. చిరు వ్యాపారులకు భద్రత కల్పించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, నాయకులు ఎంబేటి చంద్రయ్య, శశికుమార్ పాల్గొన్నారు.

వాకాడు తాలూకా ఏపీ ఎన్‌జీవో నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్‌జీవో వాకాడు తాలూకా కార్యవర్గం

వాకాడు: ఏపీ ఎన్‌జీవో వాకాడు తాలూకా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. వాకాడు తాలూకా అధ్యక్షుడిగా తిరుమూరు కృష్ణయ్య(ఫార్మసిస్ట్), ఉపాధ్యక్షుడిగా అఖిల్ యాదవ్(ఆర్ఐ), ప్రధాన కార్యదర్శిగా యనమల శంకర్, జాయింట్ కార్యదర్శిగా ఎం.హరిబాబు ఎన్నికయ్యారు. వారిని జాయింట్ యాక్షన్ కమిటీ ఎలక్షన్ ఆఫీసర్స్ జనార్ధన్, గిరిబాబు, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ వేము దినకర్‌బాబు అభినందించారు.

గ్రామాల సమీపంలో బస్ షెల్టర్ నిర్మించాలని వినతి

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారిలోని తాళ్వాయిపాడు–పెన్నేపల్లి మధ్య ప్రయాణికులకు అనుకూలంగా బస్ షెల్టర్ నిర్మించాలని స్థానికులు కోరారు. వారు శుక్రవారం జిల్లా కార్మిక సంఘం నేత చేపల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బస్ షెల్టర్ కోసం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో స్థలాన్ని కేటాయించారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మధు, శ్రీనివాసులు, భాస్కర్, పెంచలయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి కాలువ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



కాలువ స్థలం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ జెడ్పీటీసీ, ఆక్రమణకు గురవుతున్న రోడ్డు స్థలం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ పరిధిలో ఉన్న మామిడి కాలువను కొంతమంది పూడ్చివేసి స్థలాన్ని ఆక్రమించినట్టు టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పేరంశెట్టి రామయ్య ఆరోపించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పేరంశెట్టి రామయ్య, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిపి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఇక్కడ స్థలం విలువ రూ.కోట్లలో ఉందని తెలిపారు. దీంతో కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. కాలువలు, వంక పొరంబోకు భూములను సైతం వదలడం లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మామిడి కాలువ స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా మేనకూరు నుంచి భీమవరం గ్రామానికి వెళ్లే రోడ్డును కూడా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కలెక్టర్ చేయూత ఇస్తున్నారని కొనియాడారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నియమాలు పాటించాలి

నాయుడుపేట టౌన్: ప్రైవేటు కళాశాలలు, పాఠశాల బస్సు డ్రైవర్లు రోడ్డు నియమాలు పాటించాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆదేశించారు. ఆయన శుక్రవారం ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులను తరలించరాదన్నారు. కళాశాల, పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థల యూనియన్ నాయకుడు చిగురువాడ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ కళాశాలలు పాఠశాలల వద్ద ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందన్నారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

వెంకటగిరి రూరల్: వాహనదారులు ఏకాగ్రతతో వాహనాలు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన శుక్రవారం విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వియోగం చేసుకోండి

సైదాపురం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు కోరారు. ఆయన శుక్రవారం సైదాపురంలో పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో సోలార్ ప్యానళ్లను అందజేస్తోందని తెలిపారు. ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు 60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ రుణాల రికవరీని వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

ప్రాథమిక దశ నుంచే పిల్లల్లో వికాసం పెరగాలి


విద్యా వికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య

వాకాడు: ప్రాథమిక విద్యా దశ నుంచే పిల్లల్లో వికాసం అభివృద్ధి చెందాలని శ్రీ భారత్ ట్రస్టు చైర్మన్ కె.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం వైస్ ఎంపీపీ వాటంగారి వెంకటరమణయ్యతో కలిసి కొండూరుపాళెంలో శ్రీ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యా వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ వికాస కేంద్రం ద్వారా పేద విద్యార్థులను ప్రాథమిక దశ నుంచే వివేకవంతులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందులో భాగంగా వారికి విద్యతోపాటు యోగాసనాలు, క్రీడలు, ఆరోగ్యం, వృత్తి నైపుణ్యం, కుటుంబ వ్యవస్థపై గౌరవం, క్రమశిక్షణ, మంచి నడవడిక తదితర విషయాలపై శిక్షణ ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కొండూరు చిన్న వెంకటేశ్వర్లు, కాపులు కె.రజిని, టి.అంకయ్య, ఎస్.అంకయ్య, ఉపాధ్యాయులు ఇలేఖ్య, కె.శ్రీనివాసులు, బి.బాబు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం


కలువాయిలో తనిఖీ చేస్తున్న నెల్లూరు జిల్లా అటవీ అధికారి మహబూబ్‌బాషా

కలువాయి: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు నెల్లూరు జిల్లా ఫారెస్టు అధికారి మహబూబ్ బాషా తెలిపారు. పట్టా భూముల్లో పెంచిన ఎర్రచందనం చెట్లు కొట్టుకునేందుకు అనుమతులు కోరిన నేపథ్యంలో ఆయన శుక్రవారం కలువాయిలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌ల పరిధిలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయని తెలిపారు. వీటి రక్షణకు బేస్ క్యాంపులు, స్ట్రైకింగ్ ఫోర్సు, రెగ్యులర్ సిబ్బందితో కూంబింగ్ చేస్తున్నట్టు తెలిపారు. తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్ తెగచర్ల, గోనుపల్లి ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాపూరు, కలువాయి అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్య అభ్యసించాలి


సైదాపురం : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


రాపూరు: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని ఐసీడీఎస్ సీడీపీవో సునందన తెలిపారు. మండలంలోని వేపినాపి, గోనుపల్లిలో శుక్రవారం బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారం ఏర్పాటుచేశారు. ఆమె మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సౌజన్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తగా ఉండాలి

చిల్లకూరు: ప్రస్తుతం సమాజంలో బాలికలు, యువతులపై అఘాయిత్యాలు పెరిగాయని, బాలికలు జాగ్రత్తగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబి తెలిపారు. మండలంలోని కడివేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుకమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతమ్మ, రాధ, సుగుణమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: మండలంలోని మేనకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీడీపీవో ఉమామహేశ్వరి, హెచ్‌ఎం రామసుబ్బయ్య ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ బాలికల హక్కులు, సమస్యలు ఎదురైనప్పుడు కాల్ చేయాల్సిన హెల్ప్ లైన్ నంబరు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కే మణెమ్మ, మహిళా పోలీసు స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్త సుకుమారి పాల్గొన్నారు.


రాపూరు : ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

సైదాపురం: బాలికలు రంగాల్లోనూ రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫాతిమా తెలిపారు. బాలికా దినోత్సవం సందర్భంగా సైదాపురంలోని ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలను బాగా చదివించాలని సూచించారు. బాలికలు ఆపదలో ఉన్నప్పుడు సహాయం కోసం 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అనంతరం బాగా చదువుకుంటామని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవకుమార్ పాల్గొన్నారు.